# సింగిల్ పేజీ కథలు

## వ్యాపారం

**కోస్తాప్రాంతం వాళ్ళు ఎక్కువగా సెటిలైన కూకట్‌పల్లి ప్రాంతంలో కొత్తగా డెవలప్ అవుతున్న ప్రశాంతి నగర్ కాలనీలో స్వగృహ స్వీట్స్ షాపు ఓపెన్ చేశాను.**

ఇక వెనక్కి తిరిగి చూడలేదు. రోజూ నాలుగైదు వేలు అమ్ముతున్నా, పండుగలొస్తే పదివేలు అమ్ముడవుతున్నాయి. త్వరలోనే ఇల్లు కొనుక్కున్నా. గృహప్రవేశానికొచ్చిన చుట్టాలు బిత్తరపోయారు నా ఇల్లు చూసి. పోటీలు పడి పిల్లనివ్వడానికి తిరగసాగారు. వసుంధరతో నా పెళ్ళయింది.

అశోక్ నా పాలిట దేవుడులాంటోడు. వాడి సలహా వల్లనే హైదాబాద్‌లో సెటిలయ్యాను.

ఒకరోజు తాళ్ళగడ్డ నుంచి మా అక్కయ్య ఫోన్ చేసింది.

"అరేయ్ తమ్ముడూ హేమంత్‌ని పంపిస్తాను. వాడితో ఒక స్వీట్‌షాపు పెట్టించరా!" అన్నది.

"వాడికేం ఖర్మ? మీకు అక్కడ పొలాలు, తోటలు వున్నాయిగా! వాటిని చూసుకుంటే చాలదూ?" అన్నాను.

"ఏం లాభం లేదురా! అదీగాక వాడు ఏదైనా వ్యాపారం చేస్తానని గొడవ చేస్తున్నాడు. నీ వ్యాపారం బాగానే వుందిగా! కొన్నాళ్ళు ట్రైనింగ్ ఇచ్చి సిటీలో స్వీట్‌షాపు పెట్టించు" అన్నది.

"సరే పంపించు" అన్నాను.

హేమంత్ నా దగ్గరకు వచ్చేశాడు. నా దగ్గర ట్రైనింగ్ అవుతున్నాడు.

"మావయ్యా! ఈ స్వీట్స్ వ్యాపారంలో చాలా చాకిరీ వుందే. ఇరవై నాలుగు గంటలూ పనే" అన్నాడు.

నాకు మండుకొచ్చింది. ఈకాలం కుర్రాళ్ళకి ఈజీ మనీ కావాలి. కష్టపడ్డానికి బద్ధకం.

"మరి డబ్బులు వూరకే వస్తాఏంట్రా? ఎంత కష్టపడితే అంత లాభం" అన్నాను.

"కష్టపడకుండా కోట్లు సంపాదించే వాళ్ళున్నారు" అని వాడికి తెలిసిన పేర్లు చెప్పుకొచ్చాడు.

"అదంతా అదృష్టంలే" అన్నాను.

"అదృష్టం మనల్ని వెతుక్కుంటూ రాకపోతే, మనమే అదృష్టాన్ని వెతుక్కుంటూ పోవాలి" అన్నాడు.

'వీడికి అతి తెలివి ఎక్కువే' అనుకున్నాను.

స్వీట్‌షాపు నిర్వహించడానికి పడుతున్న చాకిరీ, దాదాపు పన్నెండు గంటలు షాపులో కూర్చోవడం వాడికి నచ్చినట్లు లేదు. అతి కష్టం మీద నా దగ్గర సంవత్సరం పాటు వున్నాడు.

సంక్రాంతి పండుగ వచ్చింది. ఇంటికెళ్ళి వస్తానని



వెళ్ళిపోయాడు. ఇక అంతే. అంతులేదు. వాడే వస్తాడని ఎదురుచూశాను. పది రోజులు దాటింది. ఇరవై రోజులైంది.

ఒకరోజు హేమంత్ ఫోన్ చేశాడు.

"మావయ్యా! మా వూళ్లోనే మెడికల్ షాపు ఓపెన్ చేస్తున్నాను. ఓపెనింగ్‌కి నువ్వు, అత్తయ్య తప్పకుండా రావాలి" అన్నాడు.

నేను షాక్ తిన్నాను.

స్వీట్‌షాపు పెడతానని ట్రైనింగ్‌కి వచ్చినవాడు, మెడికల్ షాపు పెట్టడం ఏమిటో నాకు అర్థం కాలేదు.

"మీ వూళ్ళో మెడికల్ షాప్ ఏంట్రా నా బొంద? అక్కడేం నడుస్తుంది?" అన్నాను.

"మా వూళ్ళో గవర్నమెంట్ హాస్పిటల్ కట్టించారు మావయ్యా! మావూరాయన మినిష్టర్ అయ్యాడులే. తన పలుకుబడి వుపయోగించి హాస్పిటల్ శాంక్షన్ చేయించాడు. వారంలో ఓపెనింగ్. ఆ రోజే మన షాపు ఓపెనింగ్. హాస్పటల్ ఎదురుగానేలే" అన్నాడు.

నాకు మతిపోయినట్లయింది. గవర్నమెంటు హాస్పటల్ వుంటే అంతా అక్కడికే పోతారు. వాళ్ళే వుచితంగా మందులు ఇస్తారుగా. ఇక వీడి షాపులో మందులు ఎవడు కొంటాడు?

"నీకేమైనా మతిపోయిందేంట్రా? అసలు మెడికల్ షాపుపెట్టమని నీకు సలహా యిచ్చిన వెధవ ఎవడు?" అన్నాను కోపంగా.

"మా ఫ్రెండ్ నాగిరెడ్డి మావయ్యా! వాడు నల్గొండ హాస్పటల్ ముందు షాపు పెట్టి లక్షలు సంపాదిస్తున్నాడు. వాడే నాకు ఈ ఐడియా ఇచ్చింది"

"ఏంటోరా! నాకంతా అయోమయంగా వుంది. గవర్నమెంట్ హాస్పటల్ ముందు మెడికల్ షాపేంట్రా? ఎట్లా నడుస్తుంది?" సందేహం వెలిబుచ్చాను.

"గవర్నమెంట్ హాస్పటల్ వున్నచోటే మెడికల్ షాపు వ్యాపారం జోరుగా సాగుతుంది మావయ్యా! నేను స్టడీ చేశాలే. ఎందుకంటే హాస్పటల్లో డాక్టర్లు మందులు, ఇంజెక్షన్లు రాస్తారు. కానీ అవేవీ హాస్పటల్లో వుండవు. అక్కడ స్టాకు రాగానే అవి మన షాపులోకి వచ్చేస్తాయి. రోగులు చచ్చినట్లు మనషాపు కొచ్చి కొనాలన్నమాట.."

హేమంత్ చెప్తున్న మాటలు వింటుంటే నాకు మతిపోతున్నట్లుగా వుంది.

"యాక్సిడెంట్ కేసులు, అర్జెంట్ కేసులు వస్తే డబ్బులే డబ్బులు. దీన్ని మించిన బిజినెస్ లేదు మావయ్యా!"

హేమంత్ చెప్తూనే వున్నాడు.

**-సి.ఎన్.ఆర్.ప్రసాద్ (హైదరాబాద్)**